# నాగరీకం

**– యం. ఉదయభాను**

ఆరోజు నేను ఆఫీసుకు వెళ్ళేసరికి అందరూ విచారంగా నిల్చుని ఉన్నారు. విషయం ఏవిటో కనుక్కుంటే మా ఆఫీసులో పనిచేసే అటెండర్ నిన్నరాత్రి హఠాత్తుగా చనిపోయాడని తెలిసింది.

అతను చేసేది అటెండర్ పనే అయినా మా అందరితో ఎంతో మర్యాదగా మసలుకొనేవాడు. అందరి తలలో నాలుకలా ఉండేవాడు. అతనిది సిటీని ఆనుకొని ఉన్న చిన్న పల్లెటూరు.

నేను మరో నలుగురం కొలీగ్స్ కలిసి యాదగిరి దహన సంస్కారాలలో పాలుపంచుకోవడం మానవత్వంగా భావించి మోటార్ సైకిళ్లపై బయలుదేరాం.

★★★

దారిపొడుగునా యాదగిరి మంచితనం గురించే మాట్లాడుకోసాగాం. మాటల్లోనే సిటీదాటి ఊరి పొలిమేర చేరుకున్నాం. మెగాసిటీ ప్రక్కన అంత చిన్న కుగ్రామాన్ని చూసిన మాకు తెగ ఆశ్చర్యం వేసింది.

ఊళ్ళో ఎక్కువ భాగం పూరి గుడిసెలే. ఓ పది పెంకుటిళ్ళు, అరడజను డాబా ఇళ్ళు ఉన్నట్టున్నాయి. ఊరి మొదట్లోనే ఓ చెట్టుకింద మోటార్ సైకిళ్ళు పెట్టి యాదగిరి ఇంటి గురించి అడిగేసరికి అక్కడున్న ఆడవాళ్ళు ఘొల్లున ఏడుస్తూ

''యాద్గిరిని చూడనీకి వచ్చింండ్రా బిడ్డా. పట్నంకెళ్ళి వస్తుండ్రా రండి చూపిస్తాం'' అంటూ మాతో కదిలారు.

మేం నడుస్తూ గమనించాం. ఊరంతా ఖాళీ అయినట్టుగా ఉంది. అన్ని ఇళ్ళ తలుపులు వేసి ఉన్నాయి.

ఊరి మధ్య స్కూలు ఆవరణలో యాదగిరి పార్థి శరీరాన్ని ఉంచారు. ఆడా, మగా, పిల్లా ముసలీ, ముతకా అందరూ అక్కడ చేరుకున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఊరి జనం అంతా అక్కడే గుమిగూడి ఉన్నారనడం సబబు.

మేము కూడా ఓ ప్రక్క నీడ చూసుకొని నిల్చున్నాము. అక్కడెవరో పెద్దమనిషి కనపడితే ''ఇంకా తంతుకు ఆలస్యం ఉందా? ఇంకా ఎవరన్నా దగ్గరి బంధువులు రావాలా?'' అని అడిగాం.

దానికి పెద్ద మనిషి ''అదేం మాట బిడ్డా! ఈ చుట్టుపక్కనున్న పది ఊళ్ళ నుంచి రావాలి యాద్గిరిని చూడాలా అందాకా ఏం సాగదు.''

ఆయన మాట పూర్తి కాకముందే జనం బిలబిలమంటూ గుంపులు గుంపులుగా రాసాగారు.

వయసులో చిన్నవాళ్ళయితే ''యాద్గిరి నాయనో'', అని పెద్దవాళ్ళయితే ''యాద్గిరి అన్నో!'' అంటూ శోకాలు పెట్టి ఏడుస్తున్నారు.

అక్కడ ఉన్న వాళ్ళల్లో ఏడుపు ముఖాలు లేంది మాకేనేమో నన్న అనుమానం నాకొచ్చింది. కారణం నాగరీకమనే ముసుగు ధరించిన వాళ్ళం మేము.

ఇదంతా చూస్తుంటే సరిగ్గా సంవత్సరం క్రితం మా ఫ్లాట్‌లో ఓ మహాకవి మహాభినిష్క్రమణం జ్ఞాపకం వచ్చింది.

★★★

నగరం నడిబొడ్డున ఉన్న ఫ్లాట్‌లవి. మేమున్న అపార్ట్‌మెంట్‌లో ఎక్కువ భాగం తెలుగేతరులే. సింధీలు, మార్వాడీలు, పంజాబీలు. చాలా తక్కువమంది తెలుగువాళ్ళుండేవాళ్ళు.

వాళ్ళదంతా బిజినెస్ కల్చర్. ఉదయం ఇంట్లో నుండి బయలు దేరినపుడు తెరచుకొన్న తలుపులు మళ్ళీ ఏ అర్ధరాత్రికో తెరచుకొనేవి. తలుపు మూసుకుంటే అదే ప్రపంచం. ఎవరి ప్రపంచం వారిది. ఇరుగుపొరుగు ఎవ్వరికీ అక్కర్లేదు.

అలాంటి వాతావరణంలో మా ఫ్లాట్ ఎదురుగా ఉన్న ఫ్లాట్‌లోకి తెలుగు వాళ్ళు వస్తున్నారని తెలిసి మాకెంతో ఆనందం కలిగింది.

రెండు రోజుల్లో వాళ్ళ సామాన్లు వచ్చాయి. నేను కూడా ఆఫీసు పనుల హడావిడిలో పడి వాళ్ళను కలుసుకునే వీలు కాలేదు.

నాలుగు రోజుల తరువాత ఓ ఉదయాన నేను మార్నింగ్ వాక్‌కు గాను బయలుదేరుతుంటే మా ఎదురింటి ఫ్లాట్ పై నున్న నేమ్ ప్లేట్ పై పేరు చూడగానే ఆశ్చర్యంతో నా నోట మాట రాలేదు. మహదానందంతో ఉక్కిరిబిక్కిరయ్యాను. ఎంతటి ఉద్వేగ్నతకి లోనయ్యానంటే ఆ క్షణాన నా చేతులతో ఆ నేమ్ ప్లేట్‌ను ఆప్యాయంగా స్పృశించకుండా ఉండలేకపోయాను.

డా.సారధి. నా అభిమాన కవి. ఛీ, ఛీ, స్వార్ధ చింతనతో అభిమానాన్ని సంకుచితం చేస్తున్నాను. ఆయన ఆంధ్రుల అభిమాన కవి, కాదు కాదు యావద్భారత దేశం గర్వించదగ్గ జాతీయ కవి డా.సారధిగారు.

నేను అలా చేతనా చేతనా స్థితిలో ఉండగానే తలుపు తెరుస్తున్న చప్పుడయింది. పక్కకు జరిగా తెల్లటి మల్లెపువ్వులాంటి పంచెకట్టు, అంతకన్నా చల్లని వెన్నెలలాంటి నవ్వుతో నన్ను పలకరించారాయన.

''హల్లో...ఐయామ్ డా.సారధి'' అంటూ స్నేహ హస్తం చాచారు.

ఆ చేయి అందుకున్న నా వళ్ళు పులకరించింది.

''నేను...కృష్ణ...'' తడబాటుగా అన్నాను.

''ఓహ్! మీరూ తెలుగు వాళ్ళేనా..? చాలా సంతోషం ఎదురింట్లో ఏ సర్దార్జీలో ఉంటారనుకొని హడలి చచ్చాం. మిమ్మల్ని కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది. కలుస్తుండండి'' అంటూ వెళ్ళిపోయారాయన.

నా కంగారులో నేను మీ అభిమానిని అని చెప్పడం మరచిపోయాను.

అలా మొదలైంది ఆ మహానుభావునితో నా పరిచయం నిజానికి నాలాంటి సగటు మనుషులతో మాట్లాడాల్సిన అవసరం ఆయనకు లేదు. కానీ నిరాడంబరమైన ఆయన ఉన్నత వ్యక్తిత్వం గొప్పతనం అది.

తెలుగు సాహిత్యంలో ఆయనది విశిష్టస్థానం. ముఖ్యంగా వెనకబడ్డ ప్రాంతంగా పేరుపడ్డ తెలంగాణా కవుల్లో ఆయనది ప్రధమస్థానం.

ఇక ఆరోజంతా నాకు తెలిసిన వాళ్ళందరికి ఆయనతో నాకు ఏర్పడిన పరిచయం గురించి గర్వంగా చెప్పుకున్నాను.

★★★

ఆ తరువాత ఎక్కడ ఆయన ఆధ్వర్యంలో కవి సమ్మేళనాలు, సాహిత్య సమావేశాలు జరిగినా నన్ను తనతో తీసుకెళ్లేవారు. ఏవైనా కొత్త కవితా సంపుటాలు అచ్చయితే తప్పనిసరిగా ఓ కాపీ నాకిచ్చేవారు.

అప్పటి ప్రభుత్వం కవులకిచ్చే అత్యున్నత పదవినిచ్చి గౌరవించింది.

అమెరికా, యూరప్ దేశాల్లో తెలుగు తేజాన్ని చాటడానికి వెళ్ళారు. దిగ్విజయంగా యాత్ర పూర్తి చేసుకొచ్చారు.

ఈ లోపల ప్రభుత్వం మారింది. గడిచిన ప్రభుత్వం ఏర్పరచిన పదవులను సంకుచిత బుద్ధితో లాగేసుకుంది ఇప్పటి ప్రభుత్వం.

సారధిగారిది ఏ ఎండకా గొడుగు పట్టేతత్వం కాదు. ఈ చర్యవల్ల వ్యక్తిగతంగా వారికి ఒనగూడిన నష్టం ఏమీ లేకుండా నాలాంటి వేలాది మంది అభిమానులకు తీవ్ర మనస్తాపం కలుగజేసింది.

తెలుగువారికి దగ్గరవ్వాలని అంతకుముందు తానున్న మద్రాసు నుండి రాష్ట్ర రాజధానికి మకాం మార్చారు. బంగారు బాతులాంటి సినిమా పరిశ్రమని తృణప్రాయంగా ఎంచారాయన.

కాలం పరుగు తీస్తోంది.

★★★

ఓసారి ఆఫీసు పనిమీద నేను బొంబాయి వెళ్ళాల్సి వచ్చింది. నెలరోజులు అక్కడే ఉండి పని పూర్తవగానే తిరిగొచ్చాను.

నేను ఇంటికి వచ్చేసరికి మా ఎదురింటికి తాళం వేసి ఉంది. కారణం మా ఆవిడ చెప్పింది సారథిగారికి సడన్‌గా హార్ట్ ఎటాక్ వచ్చిందని. జె.జె.హాస్పిటల్లో చేర్చారని.

నేను బట్టలు కూడా మార్చుకోకుండా హడావిడిగా హాస్పిటల్‌కు పరుగెత్తాను.

ఆయన బెడ్ దగ్గర వాళ్ళావిడ, వాళ్ళ అబ్బాయి ఉన్నారు. నన్ను చూస్తూనే ఎప్పటిలా స్వచ్ఛమైన నవ్వుతో పలకరించారు.

''రా కృష్ణా ఇప్పుడేనా రావడం''

ఆయన దగ్గర కూర్చున్నాను.

''మీకెలా ఉంది?'' అడిగాను

''నాకేం పరవాలేదు. డాక్టర్లు గండం తప్పినట్లే అన్నారు. ఈమధ్యే తిరిగొచ్చిన రష్యా, యూరప్ దేశాల పర్యటానుభవాల్ని గ్రంథస్తం చేస్తాను'' ధృడంగా పలికారాయన.

''థ్యాంక్ గాడ్....'' మనసులో అనుకొన్నా.

మరో రెండు రోజుల్లో డిస్చార్జ్ అయి ఇంటికి వచ్చేశారాయన. ఇంటిదగ్గరే రెస్ట్ తీసుకుంటున్నారు.

ప్రపంచంలో అన్నిటికన్నా వేగమయింది ఏదంటే కాలమే. కాలం పరుగులు తీస్తోంది.

★★★

ఓ రోజు ఆఫీసులో ఉండగా ఇంటి నుండి ఫోన్ వచ్చింది అర్జంటుగా రమ్మని.

గబగబా ఇంటికి బయలుదేరా. ఫ్లాట్ సమీపిస్తుంటే ఏదో తెలియని అనీజీ ఫీలింగ్. స్కూటర్ స్టాండ్ వేసి గబగబా మెట్లెక్కాను. మా ఎదురింటి ఫ్లాట్ తలుపులు తీసి ఉన్నాయి. సన్నగా ఎవ్వరో దుఃఖిస్తున్న శబ్దం వినిపించింది. అటువైపు వెళ్ళాను.

ఇంకేం ఉంది రతనాల వీణ మూగవోయింది.

సారధిగారి జీవనయానం ముగిసింది.

ఆయన్ని చూస్తే నిదురపోతున్నట్లుగా ఉంది. మృత్యువును సైతం పరిహసిస్తున్నట్లుగా ఆయన పెదవులపై చిరునవ్వు చెరగనే లేదు.

అప్పుడు సమయం నాలుగయింది.

★★★

ఒకరిద్దరు దగ్గరి బంధువులు వచ్చారు. విషయం తెలిసిన ఆయన అభిమానులు ఒక్కరొక్కరుగా రాసాగారు.

మా అపార్ట్‌మెంట్‌లో వాళ్ళు మాత్రం ఏదో ఫార్మాలిటీగా వచ్చి మొహం చూపించి వెళ్ళిపోతున్నారు.

ఆయన పట్ల నాకున్న అభిమానం నన్ను అక్కడి నుండి కదల నియ్యలేదు. అక్కడ చేరిన బంధువర్గం సాయంత్రానికల్లా దహన సంస్కారాలు కానిచ్చేద్దామంటున్నారు.

చేష్టలుడిగి అచేతనంగా నిల్చున్నాను. నేను వింటున్నది నిజమా కాదా అని ఆలోచించుకొనే లోపునే జరగాల్సిన తంతుకు చురుగ్గా ఏర్పాట్లు జరిగిపోతున్నాయి.

నా మనస్సు ఆక్రోశించింది. 'అయ్యో ఈ ఒక్కపూట ఆగండి. మరునాడు ఉదయంకల్లా ఈ వార్త తెలిస్తే వేలాది మంది ఆయన అభిమానులొస్తారు. వాళ్ళే తమ భుజస్కంధాలపై భారం వేసుకొని ఆయన అంతిమయాత్ర కార్యక్రమం నిర్వహిస్తారు.'



ఎవరో పెద్దమనిషి అంటున్నాడు. ''ఈ రాత్రి పార్థి శరీరాన్ని ఇలాగే ఉంచితే ఫ్లాట్‌లో ఎవ్వరికీ నిద్దరలు ఉండవు'' అని.

''షిట్..ఏం చేస్తే ఆ మహాకవి ఋణం తీర్చుకోగలం. ఓ పూట ఈ చిన్న అసౌకర్యాన్ని భరించలేరా?'' నామదిలో మాట గొంతు దాటి రాలేదు.

చూస్తుండగానే వ్యాన్ తెచ్చారు. వ్యాన్‌లో ఆయన శరీరాన్ని ఎక్కించేశారు. నేను కూడా వ్యాన్‌లోకి ఎక్కాను. వాళ్ళ అబ్బాయి, మరో ఇద్దరు బంధువర్గం వాళ్ళు అంతే.

అంతిమ యాత్ర సాగింది.

మా సీట్ల క్రింద, మా కాళ్ళమధ్య నాలుగుకోట్ల తెలుగు ప్రజలను జాగృతం చేసిన మహాకవి నిర్జీవంగా పడి ఉన్నారు.

ఓ మహాకవికి జరిగే మర్యాద ఇదా? అంతిమ నివాళి అర్పించే విధానం ఇదేనా? ఓ కవీ, తెలుగువాడివిగా పుట్టడం నీవు చేసుకొన్న దుష్కృతం. అదే తమిళుడిగానో, మళయాళీగానో, బెంగాలీగానో పుట్టి ఉంటే నీ మేధా సంపత్తికి ప్రజలు నీ అడుగులకు మడుగులొత్తేవాళ్ళు.

నా కళ్ళల్లో నీళ్ళు రావట్లేదు. జరుగుతున్న తంతును మౌనంగా చూస్తున్నాను.

స్మశాన వాటికకు చేరాం. అప్పటికే రేడియోలో ఆయన మరణ వార్తను ప్రసారం చేయడం జరిగింది. మరికొంత మంది సాహితీవేత్తలు, అభిమానులు అక్కడకు చేరుకున్నారు. అంతిమదర్శనం కోసం.

శరీరాన్ని చితిపైకి చేర్చారు. ఆయన కుమారుడు నిప్పంటించాడు.

★★★

మా అపార్ట్‌మెంట్‌కి తిరిగి వచ్చేశాం.

మా పక్క ఫ్లాట్‌లోని సర్దార్జీ, సింధీ కుటుంబాల వాళ్ళు చైనీస్ రెస్టారెంట్‌లో డిన్నర్ చేసి వస్తున్నారు.

మరో రెడ్డిగారు విస్కీ బుడ్డిని వెనక్కి పెట్టుకొని నడుస్తూ తన ఫ్లాట్‌లోకి వెళ్ళిపోయాడు. మరో మార్వాడీ కుటుంబం చాట్ బండార్‌లో సుష్టుగా లాగించి తేన్చుతూ తమ వాటాలోకి వెళ్ళిపోయారు.

నేను కొండంత దిగులు గుండెలో దాచుకొని నా రూమ్‌లోకి వెళ్ళి బెడ్‌పై వాలిపోయి గుండె భారం తీరేలా పొగిలి పొగిలి ఏడ్చాను.

ఓ మహాకవికి నివాళులర్పించాల్సింది ఇలాగేనా? మనుషులింత యాంత్రికంగా ఎలా ఉండగలుగుతున్నారు.

★★★

''కృష్ణా...కృష్ణా'' నా భుజం పట్టి కుదపటంతో ఇహంలోకి వచ్చా.

మా చుట్టూ జనం గుంపులు గుంపులుగా యాదగిరి శవం వెనుక పరుగులు తీస్తున్నారు. ప్రతీ ఒక్కరూ భుజం మార్చుకుంటున్నారు.

ఆ రాత్రి ఆ ఊళ్ళో పొయ్యి వెలగలేదు.

డా.సారధిగారు పాట ఒకటి జ్ఞాపకం వచ్చి నా కళ్ళు చెమర్చాయి.

''నీటి బుడగేరా జీవితమూ
జగతిన కాదేదీ శాశ్వతము....''

నాగరికం పేరున రాగద్వేషాలను అణుచుకొనే పట్నవాసులకంటే, కల్లాకపటం ఎరుగక కష్ట సుఖాలకు స్పందించే ఈ పల్లె ప్రజలే నాకెంతో ఉన్నతులుగా కనిపించారు. ☆